
నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 30 జూన్ 2024 | NIZAMABAD


- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో శీనన్నది పెద్దన్న పాత్ర
- పీసీసీ చీఫ్‌గానూ అద్భుతంగా రాణించిన వైనం
- ఆయన నాయకత్వంలోనే రెండుసార్లు అధికారంలోకి కాంగ్రెస్
- ఎంతో మందిని రాజకీయాల్లో ప్రోత్సహించిన డీఎస్
- ఇందూర్ ముద్దబిడ్డ మృతిపై శోకతప్తమైన ఉమ్మడి జిల్లా

# డీఎస్ అస్తమయం



## అనారోగ్యంతో డి.శ్రీనివాస్ కన్నుమూత



**ఇందూరు ముద్దుబిడ్డ,** పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ (75) ఇకలేరు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. డీఎస్‌గా రాష్ట్ర రాజకీయాల్లో అందరికీ సుపరిచితుడైన ఆయన స్వస్థలం నిజామాబాద్ జిల్లా వేల్పూర్. సాధారణ కార్యకర్తగా కాంగ్రెస్‌లో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయా హోదాల్లో విశేషంగా రాణించారు. హస్తం పార్టీని వరుసగా రెండు సార్లు అధికారంలోకి తేవడంలో డీఎస్ కీలక పాత్ర పోషించారు. ఆయన సారథ్యంలోనే 2004, 2009 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న సూత్రాన్ని బలంగా నమ్మిన ఆయన ఏ హోదాలో ఉన్నా దర్పం ప్రదర్శించలేదు. నిత్యం ప్రజలతో వారి అవసరాలను గుర్తించి తీర్చడంలో డీఎస్‌ను మించిన వారు లేరు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్న ఆయన తన రాజకీయ చతురతతో ప్రత్యర్థి పార్టీలను దీటుగా ఎదుర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న డీఎస్‌కు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ అనుచరగణం భారీగా ఉండడం గొప్ప విషయం. ఆయన శిష్యరికంలో రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకుని అందలం ఎక్కిన వారు జిల్లాలో చాలా మంది ఉన్నారు.

–నిజామాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### డీఎస్ జీవిత విశేషాలు..

| | | |
|---|---|---|
| పేరు | : | ధర్మపురి శ్రీనివాస్ |
| పుట్టిన తేదీ | : | 1948, సెప్టెంబర్ 27 |
| స్వస్థలం | : | వేల్పూర్, నిజామాబాద్ జిల్లా |
| సంతానం | : | ఇద్దరు కుమారులు (సంజయ్, అర్వింద్) |
| ఎమ్మెల్యేగా | : | 1989, 1999, 2004(మూడు పర్యాయాలు) |
| పీసీసీ చీఫ్‌గా | : | 2004-2005, 2008-2011 వరకు |
| రాష్ట్ర మంత్రిగా | : | 2004-2009 |
| మండలిలో ప్రతిపక్ష నేతగా | : | 2014 జూన్ 3-2015 జూలై 2 |
| రాజ్యసభ సభ్యుడిగా | : | 2016 జూన్ 22-2022 జూలై 4 |

### వేల్పూర్ నుంచి పీసీసీ చీఫ్ దాకా..

నాటి హైదరాబాద్ రాష్ట్రంలో 1948 సెప్టెంబర్ 27న సాధారణ వ్యవసాయ కుటుంబంలో ధర్మపురి శ్రీనివాస్ వేల్పూర్‌లో జన్మించారు. అనంతరం రాజకీయాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరి కార్యకర్తగా అసమాన సేవలను అందించారు. వివిధ హోదాల్లో పార్టీ పదవులను దక్కించుకుని అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. తొలిసారిగా 1989లో ఎమ్మెల్యేగా నిజామాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1994లో టీడీపీ అభ్యర్థి సతీష్ పవార్ చేతిలో ఓడిన డీఎస్ ఆ తర్వాత 1999, 2004 ఎన్నికల్లో వరుసగా గెలిచి సత్తా చాటారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రానికి పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కేబినెట్‌లో గ్రామీణాభివృద్ధి, ఉన్నత విద్యా శాఖ మంత్రిగా సేవలందించారు. టీడీపీ ప్రభుత్వాన్ని పడగొట్టి 2004లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావడంలో డీఎస్ కృషి ఎంతో ఉంది. పీసీసీ చీఫ్‌గా వైఎస్‌కు తోడూనీడగా నిలిచి తన రాజకీయ చతురతతో కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. ఆ కారణంగా 2009 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు మరోసారి పీసీసీ అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టింది. వైఎస్, డీఎస్ జోడిగా ఎన్నికల బరిలోకి దిగిన కాంగ్రెస్ మరోసారి సత్తా చాటి వరుసగా రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. కానీ డీఎస్ అనూహ్యంగా నిజామాబాద్‌లో ఓడిపోయారు. తెలంగాణ ఉద్యమ వేడిలో 2012 ఉప ఎన్నికల్లోనూ డీఎస్‌కు ఓటమి తప్పలేదు. దీంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరం కావాల్సి వచ్చింది. తెలంగాణ స్వరాష్ట్రంలో శాసనమండలిలో తొలి ప్రతిపక్ష నాయకుడిగా 2014 జూన్ 3 నుంచి 2015 జూలై 2 దాకా డీఎస్ సేవలందించారు.



తండ్రి మృతదేహం వద్ద కంటతడి పెడుతున్న ధర్మపురి సంజయ్

### ఆదరించిన కేసీఆర్..

కాంగ్రెస్‌లో విశేష సేవలందించిన డీఎస్‌ను ఒక దశలో ఏఐసీసీ నిర్లక్ష్యానికి గురి చేసింది. రాజ్యసభ సీటు ఇవ్వకుండా మొండిచేయి చూపింది. ఈ సమయంలోనే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ డీఎస్‌ను చేరదీశారు. పార్టీలో ఎంతో మంది ఆశావహులు ఉన్నప్పటికీ రాజకీయాల్లో డీఎస్ పాత్రను గుర్తించి, ఆయన వయసును గౌరవించి 2016లో రాజ్యసభ సభ్యుడిగా చేశారు. కొద్ది కాలం ఎంపీగా జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్న డి.శ్రీనివాస్ ఆ తర్వాత కొన్ని కారణాలతో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌కు కు దూరమయ్యారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలోనే తను కుమారులు ఇద్దరు చెరో పార్టీలో కొనసాగడం విశేషం. మరోవైపు, 2022లో ఎంపీ పదవి ముగిసిన తర్వాత డీఎస్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ తర్వాత వయోభారంతో ఇంటికి పరిమితమయ్యారు. పెద్ద కుమారుడు సంజయ్ కాంగ్రెస్‌లో, చిన్న కుమారుడు అర్వింద్ బీజేపీలో ఉండడం గమనార్హం. తండ్రి బాటలో ఇద్దరు కుమారులు రాజకీయంగా ఎదిగారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో విజయం సాధించిన ధర్మపురి సంజయ్ మొదటి మేయర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇక, తండ్రి దగ్గరే రాజకీయ పాఠాలను నేర్చుకున్న రెండో కుమారుడు అర్వింద్ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా బీజేపీలో చేరి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ పార్టీ తరపున ఎంపీగా 2019, 2024లో పోటీ చేసి వరుసగా రెండుసార్లు గెలుపొందారు.



హైదరాబాద్‌లో డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే బిగాల



నిజామాబాద్ నివాసంలో డీఎస్ పార్థివదేహం వద్ద కొడుకు, ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు





హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్

## అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

### సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం..

ఖలీల్‌వాడి, జూన్ 29: ధర్మపురి శ్రీనివాస్ పార్థివదేహాన్ని నిజామాబాద్ ప్రగతినగర్‌లోని నివాసానికి శనివారం సాయంత్రం తీసుకొచ్చారు. పార్థివ దేహం వెంట తన కుమారులు ఎంపీ అర్వింద్, మాజీ మేయర్ సంజయ్ ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల తర్వాత బైపాస్ రోడ్‌లోని డీఎస్ వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డి.శ్రీనివాస్ అంత్యక్రియలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశాలున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. దీంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆది శ్రీనివాస్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు డీఎస్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

### డీఎస్ కోసం ప్రణబ్ రాక..

జిల్లాకు చెందిన మాజీ మంత్రి అర్గుల్ రాజారాం శిష్యరికంలో డీఎస్ రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. కాంగ్రెస్ అధిష్టానానికి నమ్మిన బంటుగా మారి ఏఐసీసీ పెద్దలతో సత్సంబంధాలను కొనసాగించారు. ఈ క్రమంలోనే ఆయనకు అప్పుడిగా మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నిలిచారు. డి.శ్రీనివాస్ తన షష్టిపూర్తి మహోత్సవాన్ని నిజామాబాద్ జిల్లాలో 2008లో ఘనంగా నిర్వహించారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న ఆ సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో ప్రణబ్ ముఖర్జీ రాగా, మార్గ మధ్యంలో ఆయన కాన్వాయ్‌ను ఉద్యమకారులు అడ్డుకుని తెలంగాణ ఉద్యమ సెగను రుచి చూపించారు. అర్గుల్ రాజారాం, ప్రణబ్ ముఖర్జీలను గురువులుగా భావించిన డీఎస్ వారి బాటలోనే నడిచే వారు. వారు నేర్పిన రాజకీయ విలువలను పాటించేవారు. డీఎస్ నాయకత్వంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అనేక మంది రాజకీయంగా ఎదిగారు. తన అనుచరులకు ఏ ఇబ్బంది కలిగినా రాత్రీపగలూ తేడా లేకుండా వాలి పోతారన్న గుర్తింపు డీఎస్‌కు ఉంది. నమ్మిన వారి బాగోగులు చూసుకునే డి.శ్రీనివాస్‌ను అందరూ ముద్దుగా శీనన్న అని పిలుచుకుంటారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధిలో డీఎస్ పాత్ర ఎనలేనిది. ఎత్తిపోతల పథకాల స్థాపన, నిజామాబాద్‌కు కార్పొరేషన్ హోదా, బైపాస్ రోడ్డు ఆయన కాలంలోనే ఏర్పడ్డాయి. మరోవైపు డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీ స్థాపనకు కృషి చేశారు.

---

# ఆస్తి కోసం దారుణం.. కొడుకును కడతేర్చిన తండ్రి

### గండిమాసానిపేటలో ఘటన

ఎల్లారెడ్డి, జూన్ 29: ఆస్తి కోసం కన్న కొడుకును కడతేర్చిన దారుణ ఘటన ఎల్లారెడ్డి పట్టణ శివారులోని గండిమాసానిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండిమాసానిపేట గ్రామానికి చెందిన కొడిప్యాక వెంకటేశానికి కొడుకులు సాయిలు (35), పరంధాములు ఉన్నారు. వెంకటేశానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కొద్ది రోజులుగా సాయిలు తనకు పొలం కొంత ఇవ్వాలని, తాను ఎలా బతకాలని తండ్రితో గొడవ పడుతున్నాడు. దీంతో గ్రామంలో పంచాయితీ పెట్టి తండ్రిని ప్రశ్నించగా పంచాయితీ పెద్దలు ఒక ఎకరం పొలం సాయిలుకు ఇవ్వాలని వెంకటేశానికి చెప్పారు. పంట పండించుకోవడానికి ఎకరం భూమి కావాలని అడుగుతుండడంతో కొడుకుపై కక్ష గట్టి మట్టుపెట్టినట్లుగా గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి సాయిలు మద్యం తాగి వచ్చి ఇంటి పక్కనే ఉన్న ఇసుకలో నిద్రిస్తుండగా తండ్రి వెంకటేశం కొట్టి చంపి, శవాన్ని ఇంటి సమీపంలో ఉన్న పోచారం ప్రధాన కాలువలో పారేసి పక్కనే మద్యం సీసా, మిక్చర్ పొట్లం పెట్టినట్లు గుర్తించారు. కొడుకును కొట్టి చంపిన తండ్రి వెంకటేశం శనివారం ఉదయం తన కొడుకు కనిపించడం లేదని వెతికినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రధాన కాలువలో సాయిలు మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్ పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రప్పించడంతో అసలు విషయం బయటపడింది. భూమి కోసమే సాయిలును తండ్రి వెంకటేశం హతమార్చినట్లు తెలుస్తున్నదని సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. మృతుడి భార్య అనిషవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని పేర్కొన్నారు.




గండి మాసానిపేటలో హత్యకు గురైన కొడిప్యాక సాయిలు

# పది రోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

### వీసీలో సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్

కామారెడ్డి,జూన్ 29: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి జూన్ 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో కొంత నెమ్మదించినా ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యాసంస్థ ఏర్పాటుకు అనుకూలంగా ఉండే 20ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అన్నారు. ఆధార్ బయోమెట్రిక్ వేలిముద్ర స్వీకరణ సంబంధించి ఎల్‌వో పరికరాల వినియోగ గడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలకు ఎల్–1 బయోమెట్రిక్ పరికరాలు పంపించామని, సరిగ్గా రీప్లేస్ చేయాలని అన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్వోలు రంగనాథ్ రావు, ప్రభాకర్, రమేశ్ రాథోడ్, ఏవో మసూర్ అహ్మద్, పర్యవేక్షకులు ఉమలత, సరళ, స్వప్న పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్, పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు



విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేస్తున్న జడ్జి, సీపీ

# లక్ష్యసాధనతో ముందుకెళ్లాలి

### జిల్లా జడ్జి సునీత కుంచాల

డిచ్‌పల్లి, జూన్ 29: పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో ముందుకు సాగాలని జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు 250 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి సునీత కుంచాల, సీపీ కల్మేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనంలో క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాబ్లీ గేట్ల ఎత్తివేత రేపే..

మోర్తాడ్, జూన్ 29: ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు జూలై 1న తెరుచుకోనున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు జూలై1 నుంచి అక్టోబర్ 28వరకు ఎత్తి ఉంచాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం 1న త్రిసభ్యకమిటీ ఆధ్వర్యంలో బాబ్లీ గేట్లు తెరవనున్నారు. ఈ గేట్లు తెరచి ఉంచడంతో ఈ సీజన్‌లో ఎగువ భాగంలో కురిసిన వర్షాల ద్వారా వచ్చే నీరంతా ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతుంది. దీంతో శ్రీరాంసాగర్ జలకళను సంతరించుకునే అవకాశం ఉన్నది. బాబ్లీ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 2.74 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రానికి 0.2 టీఎంసీల నీటి నిల్వ ఉన్నదని అధికారులు తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 1059.30అడుగులు (9.905 టీఎంసీలు) నీటి నిల్వ ఉండగా, ఈ సీజన్‌లో 3.550 టీఎంసీల వరద వచ్చి చేరినట్లు పేర్కొన్నారు.

# అందని యూనిఫామ్‌లు.. సివిల్ డ్రెస్‌లోనే విద్యార్థులు

నాగిరెడ్డిపేట, జూన్ 29: పాఠశాల విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫామ్‌లు పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. దీంతో సగం మంది విద్యార్థులు సివిల్ డ్రెస్‌లోనే పాఠశాలలకు హాజరవుతున్నారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో ప్రార్థనకు చాలా మంది విద్యార్థినులు సివిల్ డ్రెస్‌తోనే హాజరయ్యారు. ఇప్పటికైనా యూనిఫామ్‌లు అందజేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



సివిల్ డ్రెస్‌లో ప్రార్థనలో పాల్గొన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

# 27గంటలు.. 400కి.మీల సైకిల్ యాత్ర

**అరుదైన** రికార్డు కోసం సైకిలిస్టులు శనివారం ఎల్లారెడ్డికి వచ్చారు. హైదరాబాద్ ర్యాండోనర్స్ బృందం సభ్యులు 27గంటల్లో... 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టారు. ఉదయం 6గంటలకు బయల్దేరిన 23మంది నర్సాపూర్ మీదుగా సాయంత్రం ఆరు గంటలకు ఎల్లారెడ్డి చేరుకున్నారు. కామారెడ్డి, రామాయంపేట మీదుగా ఆదివారం ఉదయం 9గంటల్లోపు తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. బృందంలో ఆనంద్ ప్రభు, అరుణ్ తేజ్, మనోగ్యాన్ యాదవ్, శ్వేత తదితరులు ఉన్నారు.

– ఎల్లారెడ్డి, జూన్ 29

